క్లుప్తంగా

పీఎం ఇంటర్న్‌షిప్‌కు నేడు దరఖాస్తుల స్వీకరణ

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఇంటర్న్‌షిప్ దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ శనివారం స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. అర్హులకు 500 కంపెనీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్, టెన్త్ నుంచి పీజీ వరకు, బి ఫార్మసీ చేసిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు దూరవిద్య అభ్యసిస్తున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. 21 నుంచి 24 తేదీ వరకు మధ్య వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ కాలంలో నెలకు రూ. 5వేలు స్టైఫండ్ ఇస్తారని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ కోరారు. పూర్తి వివరాల కోసం 94910 57527, 94417 03053 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా రామకృష్ణ



రంపచోడవరం: ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా రంపచోడవరం తహసీల్దార్ పి.రామకృష్ణను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎంపిక చేసింది. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా జిల్లా నుంచి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా గుర్తించారు. ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవంలో అవార్డు ప్రధాన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానం వచ్చింది.తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది ఉమ్మడి కృషితో ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించినట్టు చెప్పారు.

నేడు మారేడుమిల్లిలో వైఎస్సార్ సీపీ సమావేశం

మారేడుమిల్లి: స్థానిక ఆదివాసీ వర్తకం సంఘం భవనం వద్ద మారేడుమిల్లి మండల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మిలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

'బూదరాళ్లను మూడు పంచాయతీలుగా విభజించాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యులు సంజీవ్

కొయ్యూరు: పరిపాలన సౌలభ్యం కోసం బూదరాళ్లను మూడు కొత్త పంచాయతీలుగా విభజించాలని కోరుతూ కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఎనిమిది వేల మంది జనాభా ఉన్న పంచాయతీలో 36కు పైగా గ్రామాలున్నాయన్నారు. పంచాయతీ పరిధి 60 కిలోమీటర్లు దాటి ఉందని చెప్పారు. పరిపాలన సౌలభ్యం కోసం బాలరేవుల,గరిమండ, పోకలపాలెంలను పంచాయతీ కేంద్రాలుగా చేయాలని కోరినట్టు చెప్పారు.అవకాశం ఉంటే విభజన చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



చవిటిదిబ్బలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వై.రామవరం: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మార్తేరుకు చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. చవిటిదిబ్బలు గ్రామ రైతుభరోసా కేంద్రంలో ఎంఏవో ఉషారాణి అధ్యక్షతన రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సుస్థిర వ్యవసాయం, అధిక దిగుబడుల సాధన తదితర అంశాల గురించి వివరించారు.

దాహం... దాహం



పనిచేయని కుళాయిలు

- గెడ్డలను ఆశ్రయిస్తున్న కురిడేమెట్ట గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



కలుషితమైన బావి నీటిని సేకరిస్తున్న బాలిక



నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం ట్యాంక్



దూర ప్రాంతం నుంచి నీటిని తెస్తున్న మహిళలు

పాడేరు రూరల్: బిందెడు నీటి కోసం గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి కోసం ఎక్కడో దూరాన ఉన్న గెడ్డలబాట బాటపడుతున్నారు. దాహార్తిని తీర్చండి సారూ అంటూ ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండలంలో గబ్బంగి పంచాయతీ కురిడేమెట్ట గ్రామస్తులు వాపోతున్నారు.

గ్రామంలో 54 కుటుంబాలు నివసిస్తున్నాయి. వేసవి ప్రారంభానికి ముందే గ్రామంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎన్నిసార్లు కోరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చేసేదిలేక గ్రామంలోని బావిలో ఉన్న కలుషిత నీటిని కొంతమంది తాగునీటిగా వినియోగిస్తున్నారు. చాలా మంది గ్రామానికి దూరంగా ఉన్న ఊట గెడ్డను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతర అవసరాలకు కూడా నీరు లభించక ఇబ్బందులకు గురవుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి కోసం ఇక్కట్లు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. నిర్వహణలోపంతో ఇటీవల పథకం మూలకు చేరింది. పైప్‌లు పాడైపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. చాలాదూరంలోగల ఊటగెడ్డకు వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రేగం బాలన్న, కురిడేమెట్ట గ్రామం, పాడేరు మండలం.

మరమ్మతులు చేయాలి



గ్రామంలోని తాగునీటి పథకం మూలన చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా స్పందించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సమాచారం ఇచ్చిన వెంటనే సమస్య పరిష్కారమయ్యేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలి.

– బొయిన రాజమ్మ, కురిడేమెట్ట గ్రామం, పాడేరు మండలం

ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ వంటావార్పు



ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణం జరిగే చోట వంటావార్పు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

దుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య పాఠశాలలో తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ పాఠశాల నిర్మాణానికి భూమి ఇచ్చిన వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తూ వంటావార్పుతో ఆందోళన చేశారు. 2019లో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో అప్పటి పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ భూములిచ్చిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఉద్యోగం ఇవ్వక కాలయాపన చేస్తున్నారని బాధితులు తెలిపారు. దీంతో రెండు రోజులుగా ఆందోళనలు చేస్తున్నట్టు చెప్పారు. న్యాయం జరిగేంతవరకు తమ ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. తాంగుల రాందాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొర్ర పరశురాం మాట్లాడుతూ సుమారు 10.62 ఎకరాల భూమిని ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం సేకరించారని, భూములిచ్చిన గొల్లోరి డొంబు, గొల్లోరి రాంచందర్, గొల్లోరి భగవన్‌ల కుటుంబ సభ్యులకు ఇంతవరకూ ఉద్యోగం ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవోలు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

'విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు'



ముంచంగిపుట్టు జీసీసీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

ముంచంగిపుట్టు: జీసీసీ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక జీసీసీ గోదాం,గ్యాస్ గోదాములను శుక్రవారం ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. గ్యాస్ గోదాం ఇన్‌చార్జి కొండబాబు గత రెండు సంవత్సరాలుగా సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉండడం తగదన్నారు. జీసీసీలో పనిచేస్తున్న కళాసీలు చైర్మన్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కాఫీ కొనుగోలుపై దృష్టి సారించాలని, 2వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పని చేయాలన్నారు. జీసీసీలో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బందికి అడహక్ పద్ధతిలో ప్రమోషన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిజియోథెరపీతో నొప్పుల నివారణ



ఫిజియోథెరపీపై వివరిస్తున్న వైద్యుడు రమేష్

అడ్డతీగల: శారీరక రుగ్మతల నివారణకు ఫిజియోథెరపీ చేసుకోవాలని నిమ్స్ ఫిజియోథెరపీ వైద్యులు రమేష్ తెలిపారు.మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఫిజియోథెరపీ వల్ల కలిగే ప్రయోజనాలపై నిమ్స్ వైద్య బృందం వైద్యులు రమేష్,సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. నొప్పుల నివారణకు పెయిన్ కిల్లర్స్ వాడకుండా ఫిజియోథెరపీ ఎలా చేసుకోవాలో సూచించారు.

జీసీసీ హమాలీల నిరసన



అడ్డతీగల జీసీసీ గొడౌన్ ఎదుట నిరసన తెలుపుతున్న హమాలీలు



చింతపల్లిలో నిరసన తెలుపుతున్న హమాలీలు

అడ్డతీగల: పెంచిన కూలి రేట్లు అమలు చేయాలని కోరుతూ స్థానిక జీసీసీ సివిల్ సప్లై హమాలీలు పనులు నిలిపివేసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హమాలీల యూనియన్ జిల్లా కార్యదర్శి మిర్తివాడ రాజబాబు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి పెంచవలసిన కూలి రేట్లపై సంవత్సర కాలం గడిచినా ఇంకా జీవో విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు.హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.2024 దసరా పండగకు ఇవ్వవలసిన యూనిఫాం నేటికీ ఇవ్వలేదని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకుంటే సివిల్ గొడౌన్‌ల వద్ద పనులన్నీ బంద్ చేస్తామని తెలిపారు.

చింతపల్లి: స్థానిక జీసీసీ గొడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు వెంటనే పెంచిన కూలి రేట్లను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సమ్మె చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు హమాలీల మేస్త్రీ అవనిగెడ్డ సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ సమ్మె నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేవరకు సమ్మె నిర్వహిస్తామని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న జిల్లా రవాణా అధికారి లీలా ప్రసాద్


పాడేరు : రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని, అప్పుడే ప్రమాదాల సంఖ్యను తగ్గించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి ఎస్. లీలాప్రసాద్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాడేరు వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తలార్‌సింగి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ సాగింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని నినాదాలు చేశారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వాసు, అడ్మినిస్ట్రేటర్ అధికారి జి.శ్యామ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గూడెంకొత్తవీధి సీఐ వరప్రసాద్‌కోరారు. శుక్రవారం ఆయన పెదవలస వారపుసంతతో పాటు పలుగ్రామాల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై యువతకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ద్విచక్రవాహనాలను ఆపి వారికి చాక్లెట్లు ఇచ్చి, కౌన్సెలింగ్ నిర్వహించారు. విలువైన ప్రాణాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సీఐ కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మందులు అందజేస్తున్న పశువైద్య సిబ్బంది



పశువును పరీక్షిస్తున్న వైద్యులు రాజేష్ కుమార్

వై.రామవరం: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి వీరేంద్ర తెలిపారు. యార్లగడ్డలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని ఆగ్రామ సర్పంచ్ పల్లాల పద్మావతి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి ప్రారంభించారు. అనంతరం పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు చర్యలు తీసుకో వాలని తెలిపారు. 50 పశువులకు, 86 మేకలకు ఏలికపాములు, నివారణ మందులు వేశారు. 200 కోళ్లకు వేసేందుకు మందులు పంపిణీ చేశారు. పశు సంవర్ధక సహాయకులు కె.చైతన్యకుమార్, ఎం.వెంకట రావు, కె.సతీష్ కుమార్, ఎస్.ముత్యయ్య,పి.పార్వతి పాల్గొన్నారు.

కొయ్యూరు: సీజన్ మారినప్పుడు పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యుడు కె.రాజేష్ కుమార్ తెలిపారు. రామ్‌నగర్, డి.కొత్తూరులలో శుక్రవారం పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు.మొత్తం 66 పశువులకు చికిత్స చేసి, మందులు పంపిణీ చేశారు. 60 పెయ్యలు, 206 గొర్రెలకు నట్టల్ నివారణ నిర్వహించామన్నారు.పశువైద్యులు ప్రసన్న కుమార్, వెటనరీ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏహెచ్‌ఏలు వెంకటరమణ,శివకుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తి,తుంగమడుగుల గ్రామాల్లో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 502 పశువులకు ఏలిక పాముల నివారణ మందులు వేసినట్టు పశుసంవర్ధకశాఖ అడ్డతీగల ఏడీ సీహెచ్.గణేష్ తెలిపారు.645 కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ వ్యాక్సిన్‌లు ఇచ్చామన్నారు. ఆరు గేదెలకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స చేసినట్టు చెప్పారు.

విద్యతో బాలికలకు బంగారు భవిష్యత్తు



జాంగుడ ఆశ్రమ పాఠశాలలో మానవహారం నిర్వహిస్తున్న బాలికలు



రావణాపల్లిలో ఏర్పాటు చేసిన మానవహారం



ముమ్మిడివరం పాఠశాలలో అవగాహన కార్యక్రమం



గూడెంకొత్తవీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎటపాక: చదువు బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని గౌరిదేవిపేట సర్పంచ్ ఉలవల శివకనకరాజు అన్నారు. శుక్రవారం బాలిక దినోత్సవం సందర్భంగా బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం ముమ్మిడి వరం,గౌరిదేవిపేట పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు చట్టాలు,హక్కులపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళల ప్రాధాన్యత,బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. ఈకార్యక్రమంలో మహిళా పోలీసు ఇందు,సచివాలయ సిబ్బంది పద్మజ,అంగన్‌వాడి కేంద్రం,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సీడీపీవో విజయకుమారి, ఎంఈవో రాంబాబు తెలిపారు.చదువు ద్వారా ప్రతి బాలిక ఉన్నత స్థితికి చేరవచ్చన్నారు.జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రావణాపల్లిలో శుక్రవారం బాలికలతో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఇష్టపడి చదవాలని సూచించారు. ఆరోగ్య రక్షణకు అవసరమైన పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేపట్టారు. సీఆర్‌పీ భాను,అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా గూడెంకొత్తవీధిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు, ఈవోపీఆర్డీ పాపారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని జాంగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అప్పలమ్మ, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చింతపల్లి: సమాజంలో బాలికల పట్ల ప్రతి ఒక్కరూ సద్భావంతో మెలగాలని చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.వి. రమణి అన్నారు. శుక్రవారం తాజంగిలో కస్తూర్బా విద్యాలయం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి,మున్నీషా,సత్యవతి పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధికారత విభాగం కన్వీనర్ శివకుమారి పర్యవేక్షణలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కళాశాల నుంచి రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్ వరకు విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు, ర్యాలీ అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లి, జడ్డంగి గిరిజనసంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో శుక్రవారం బాలికల దినోత్సవాన్ని సీడీపీవో దేవమణి నేతృత్వంలో నిర్వహించారు. రాజవొమ్మంగి జెడ్పీ స్కూల్‌లో కూడా బాలికాదినోత్సవాన్ని నిర్వహించారు.

అడ్డతీగల: బాలికలు విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ అన్నారు.జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులు,ఉపాధ్యాయులు,ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.అనంతరం సీడీపీవో సుధ మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం,ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

హెచ్‌సీ మృతికి సంతాపం



వీరభద్రం(ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఊబా వీరభద్రం (60) శుక్రవారం మృతిచెందినట్టు ఎస్‌ఐ చిన్నబాబు తెలిపారు. ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్టు చెప్పారు. ఆయన స్వగ్రామం వేళంగి. హెచ్‌సీ మృతి పట్ల స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ చిన్నబాబు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి బరిలో నిలుస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులునాయుడు శుక్రవారం స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ ,పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్,రాష్ట్ర నేత కిముడు దేముళ్లనాయుడు,గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నీలకంఠం,కుర్తాడి రామారావు,అప్పలరాజులు పాల్గొన్నారు.

పెదబయలు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ జగన్మోహరావు,ప్రధాన కార్యదర్శి కొర్రా ధనుంజయ్ పెదబయలు మండలంలో శుక్రవారం కళాశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.పి.ఎల్. స్వామి బాలంనాయుడు, శ్యామసుందరం, ఎస్.బి.ఎల్. స్వామి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



సందడి చేసిన పూర్వ విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991–93 సంవత్సరాలలో చదివిన విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. వ్యాపార వేత్త కొల్లా రమేష్‌బాబు ఆధ్వర్యంలో వారంతా కలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల తరఫున స్టేజ్ నిర్మించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జాన్‌బాబు, సురేంద్ర, రవి, నాగు, గౌరి, అరుణ, పార్వతి, రోజా, బేగం పాల్గొన్నారు.

సబ్ సెంటర్ సందర్శన



బాలింతలతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు, డీపీహెచ్‌ఎన్‌వో భూలోకమ్మ

దుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని కంద్రుమ్ సబ్‌సెంటర్‌ను డీపీహెచ్‌ఎన్‌వో భూలోకమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సందర్శించింది. గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు, ఎస్‌వో కైలాస్, డీపీవో సతీష్, హెచ్‌వీ మంజుల, హెల్త్ అసిస్టెంట్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

ఎటపాక: యువత అసాంఘిక కార్యక్రమాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ కన్నపరాజు సూచించారు. శుక్రవారం కన్నయిగూడెం పంచాయతీ బొజ్జిగుప్ప వలసలో ఆదివాసీలతో మాట్లాడారు. గ్రామంలో తాగునీరు, విద్య,వసతి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మావోయిస్టుల వైపు ఆకర్షితులు కావద్దని చెప్పారు.ఎస్‌ఐ అప్పలరాజు పాల్గొన్నారు.